మోహినీ విలాసము

కొప్పర్తి నారాయణమూర్తిగారు, బి. ఏ., యల్. టి.,
(సాహితీసమితి)

౧

అన్యదేశ సంపర్కమువలనను, నానారాష్ట్రవార్తాపత్రికల మూలమునను ఆంధ్రులలో సర్వమానవవృత్తులందును తీవ్రపరిణామ సంచలన మారంభమాయెను. ఆంధ్రాభ్యుదయసమస్యయందు ఆంధ్రభాషా ప్రాముఖ్యము గుర్తెఱింగి వీరేశలింగ ప్రభృతులు సంస్కృతాంగ్ల భాషా గ్రంథములనుండి యనువాదముల బ్రచురించి యాంధ్ర భాషాగ్రంథరాజములను పెంపుసేయుచుండిరి. పల్లెగ్రామవాసులకు సయితము నానాదేశవార్తలదెలిపి ప్రపంచజ్ఞానము ప్రసాదింప నాంధ్రపత్రిక సమకట్టినది. కావ్యనిర్మాణవిధానము నూతనమార్గముల దిరిగినది. భావగీతముల తరగతిలో జేరిన యభినవకవిత్వము విద్యార్థుల కలములనుండి యూరుచున్నది; పండితుల యాదరణ నందుచున్నది. సామాన్యజనులజ్ఞానాభివృద్ధికి వ్యావహారిక భాషాప్రయోగ మత్యంతావశ్యకమని రామమూర్తి పంతులుగారు నిరూపించిరి. భాషాసంఘము లనేకములు స్థాపింపబడినవి. మాతృభాషా మూలమున విద్య నేర్పబడవలెననియు, నాంధ్ర విశ్వవిద్యాలయ మవసరమనియు తీర్మానించుటకు సభలు జరుగుచున్నవి.

బంగాళాదేశమునుండి విపినచంద్రపాలుడు మున్నగువారు ఆంధ్రదేశమున రాజకీయ ప్రచారము గావింపుచున్నారు. స్వరాజ్య సంకీర్తనలు పల్లెటూళ్లలోగూడ వినిపించుచున్నవి. శిశువులకు 'స్వరాజ్యం', 'వందేమాతరం' అని కొందరు నామకరణములు చేసిరి. ప్రత్యేకాంధ్రరాష్ట్రమును గోరుచు విన్నపములు చెలరేగినవి. కళాశాలలో చదువుచున్న కొందరు విద్యార్థు లనుచితప్రవర్తనమునకు శిక్షింపబడిరి; రాజకీయ ప్రచారావేశమువలన మరికొందరు దుఃఖముల ననుభవించుచున్నారు.

మతవిషయమునందు గూడ నుత్కృష్ట సంచలన మాంధ్రదేశము నావరించెను. ఆర్యసామాజికుల యుద్బోధనమున ప్రార్థనసమాజ మందిరము లేర్పాటు గావింపబడుచున్నవి. హిందూ దేవాలయములు, మతసంప్రదాయములు నిరసింపబడుచున్నవి. జన్నిదములు జారిపోవుచున్నవి. క్రాపింగులు కళ దెచ్చుచున్నవి. తిలకము పని తీరిపోవుచున్నది. పాఠశాలలయందలి విద్యార్థులు సెలవుదినములలో స్వగృహముల కేతెంచి పూర్వాచారపరాయణులైన పెద్దల వెక్కిరింపుచున్నారు. మతమును పునరుద్ధరించుటకు పత్రికలు, సభలు జరుగుచున్నవి.

సంఘ సంస్కరణాభిలాషతో వీరేశలింగం గారు ప్రహసనముల వ్రాయుచుండిరి. నిమ్నజాత్యుద్ధరణకు విద్యార్థులు కంకణము కట్టుకొనిరి. వితంతు వివాహముల ప్రోత్సాహ పరచుటకు జమీందారులు ధనము వెచ్చింపుచుండిరి. అనాథశరణాలయములు నెలకొల్పబడినవి. మహిళాపత్రికల మూలమున స్త్రీలు తమ యభిప్రాయములను, వాక్కులను స్వేచ్ఛగా ప్రచురింపుచుండిరి. ప్రిన్సిపల్ వెంకటరత్నం నాయుడుగారి శిష్యులు సాంఘిక సేవాపరులై కీర్తి గాంచుచుండిరి. కాంగ్రెసు సందర్భమున సాంఘిక సమావేశమునందు (Social Conference) శ్రీ నాయుడుగారు 'వేశ్యల, గూర్చి యొసంగిన గంభీరాధ్యక్షోపన్యాసము ఆంధ్రలోకమున ప్రతిధ్వనింపుచుండెను. వేశ్యావృత్తి మాన్పించుటకనేక ప్రయత్నములు సాగుచున్నవి.

ఇట్టి ప్రయత్నములకు నాటకరంగ మెంతయో సాయపడెను. ఆంధ్రులకు నాటకములపట్ల నభిరుచి హెచ్చుగుచున్నది. లక్ష్మీనరసింహముగారి గయోపాఖ్యానమును ప్రదర్శింపని నాటకసమాజమువారును, తిలకింపని యాంధ్రులును లేరని నిశ్చయింపవచ్చును. సామాజికుల దుష్ప్రవర్తనమువలన నాటకరంగమున కాపాదింపబడిన దోషమును, నైచ్యమును తొలగించుటకై విద్యార్థులు, ఉద్యోగస్థులు, సంపన్నులు పూనుకొనిరి. అప్పారావుగారి కన్యాశుల్క నాటకప్రదర్శనమం దనేక పట్ట

భద్రులు పాత్రధారులై ప్రేక్షకుల మెప్పు వడసి యాంధ్ర నాటకరంగమున కొక వన్నె దెచ్చిరి.

౨

సాంఘికుల విద్యాప్రవర్తనలబట్టి సంఘౌన్నత్య ముండుచో 'మోహినీవిలాసనాటకసంఘము'వా రెంతయు స్తుతిపాత్రులని చెప్పక తప్పదు. ఇందు నాయకుని వేష మును ధరించు నతడు సంఘాధ్యక్షుడగు విలాసరావు. విలాసరా విరువదినాల్గేండ్ల రూపవంతుడు. నాల్గుసంవత్సరముల క్రిందట పట్టపరీక్షయందు కృతార్థుడై కలక్టరు కచ్చేరీలో గుమాస్తాగా చేరెను. హిందూ సంఘమునందలి మతాచారముల కెంతయు గుందుచు, వానిని సంస్కరించుటకు మార్గముల నన్వేషించుచుండెను. జనసామాన్యము నందు ప్రబోధము గావింప నాటకములమూలమున సాధ్యపడునని విశ్వసించి, కళంక రహితముగ నుండున ట్లొక నాటకసంఘమును ఉద్యోగస్థులతో డ్పాటుచే స్థాపించెను. వీరు ప్రతి శనివార మొక ప్రదర్శన మిచ్చుటయు, వచ్చిన ద్రవ్యము సాంఘిక సేవకై వినియోగించుటయు జరుగుచుండెను. సాధారణముగ నాటకరంగమున కంటియుండు వ్యభిచారము, పానము, జూదము మొదలగు దోషములకు తావీయకుండుటచేతను, విద్యాధికత స్పష్టపరచుటచేతను, ఈసమాజమువా రెంతయు వాసిం గాంచుచున్నారు.

ఇట్టితటి విజయనగరం మహారాజాగారి కీనాటక ప్రదర్శనమును వీక్షించి సాంఘికుల కొక్కింత ప్రోత్సాహ మొసగ నిచ్ఛపుట్టి విలాసరావునకు తామానాడు నాటకమును దర్శించెదమని వర్తమాన మంపిరి. అమితోత్సాహముతో సాంఘికు లెల్లరు వారి పాత్రోచితములగు దుస్తులను, పరికరములను చక్కబెట్టుకొనుచుండిరి. రంగముల యమరిక మొదలగున వన్నియు సంసిద్ధము చేయబడినవి. హార్మోనియం వాయించు పాపారావానాడు వ్యాధిగ్రస్తుడై యున్నను, మహారాజావారు విజయం చేయు తరుణమున తన విద్య కనబరుపు సంకల్పముతో నాతడును నియమితకాలమునకు తన శిష్యురాలగు మోహినీసమేతుండై నాటకశాల కరుదెంచెను. సరిగా తొమ్మిది గంటలకు రాజాగారు వచ్చుటతోడనే తెర యెత్తిరి. పాత్రధారులు తమ నైపుణ్యాతిశయముల చక్కగ స్పష్టపరచుచుండిరి. ప్రేక్షకులెల్లరు సెబాసు, 'వన్సుమోరు'లను కురిపించుచుండిరి. నాటక మెంతయు రక్తి కట్టుచున్నది. గుట్టునుబట్టియున్న పాపారావు, పాపము! జ్వరముచే నొడ లెరుగకుండ వణకుచుండెను. హార్మోనియం మ్రోగు టెట్లు? నాటకమునకు ప్రధానాంగము హార్మోనియమే! నాటకరంగము గానసభగా పరిగణింపబడుదినములలో హార్మోనియమునకు టెంకాయ గొట్టిన గాని తెరయెత్తు నాచారము లేదు.

విలాసరావు గుండెలలో రాయి పడినది. కీర్తికి బదులు అపఖ్యాతి వచ్చునని అతడు భయపడుచుండెను. పాపారావు కొలదికాలములో లేచునట్లు లేదు. పావు గంటవరకు కర్తవ్య మాలోచించిరి గాని యుపాయము తోపలేదు. ప్రేక్షకులనుండి వెక్కిరింపులు వినబడుచున్నవి. గోతిలోవారు గడియారముల తీసి చూచుచున్నారు. స్త్రీప్రేక్షకులు తీవ్రముగ విమర్శించుచున్నారు. విలాసరావు కన్నుల నీరు గ్రమ్ముచుండెను.

ఈ సందర్భమంతయు గ్రహించిన మోహిని కొంత కాలక్షేపము జరుగుటకు హార్మోనియముపై వాయింపుచు చక్కని త్యాగరాయకృతి పాడ నారంభించెను. సభికుల 'హాయిహాయి'ల కంతము లేదు. మహారాజావా రనేకసారు లానందము వెలిబుచ్చిరి. విలాసరావు మోహినీగానసుధారసాస్వాదనమున నాటకమునందలి యంతరాయమును మరచి మోహినిచెంత చేరి యామెకు మెలమెల్లగ విసరుచుండెను. కృతిముగియుటతోడనే కరతాళధ్వనులచే ప్రేక్షకు లామెను బహూకరించిరి. వెచ్చని తేనీరు ఆమె పెదవుల కందించి విలాసరావు కృతజ్ఞతను వెలిబుచ్చెను.

హార్మోనియమును మోహిని సమర్థించుటచే నాటకము తిరిగి ప్రారంభింపబడెను. నాయిక నుద్దేశించి పలుకవలసిన వాక్యములను మోహిని వైపు చూచి విలాసరావు పలుకుచుండెను. చిఱునవ్వుతో మోహిని విలాసరావును ప్రోత్సాహపరచుచుండెను. కొంతసేపటికి నాటకము సమాప్తి నొందెను. నాయికానాయకుల కొరకు రాజా

గారుద్దేశించి తెచ్చిన పతకములను మోహినీవిలాసరావులకు నొసంగిరి. మోహినీగాననైపుణ్యమును మెచ్చుకొనని వారానాటి ప్రేక్షకులలో నొక్కరు నుండియుండరు.

విలాసరావు తండ్రి ప్రఖ్యాతి గాంచిన న్యాయవాది, అతడు రెండేండ్లక్రిందటనే చనిపోయెను. విలాసరావు వివాహమునకై తండ్రి యెంత ప్రయత్నించినను, తన యిచ్చ వచ్చినపుడు తన యిచ్చవచ్చిన యువతిని వివాహమాడెదననియు, తానా ప్రయత్నము చేయ నక్కరలేదనియు విలాసరావు ఖండితముగా చెప్పుచుండెను. తండ్రి గతించిన పిమ్మట గూడ ననేక సంబంధములు వచ్చినను అతడియ్యకొనలేదు. తాను ప్రేమించు యువతీ గుణాతిశయములపట్ల నింతె లక్ష్యముగల విలాసరావును మోహినీగానకళా నైపుణ్యము జయింపగల్గెనా? కాదు, కాదు! పరిణయమునకుమాత్ర మర్హత గల్గిన యువతిగా మోహిని విలాసరావున కగపడెను. దీర్ఘ పరిణయమువిూదగదా మంచిచెడ్డలు స్పష్టపడుట!

మోహినితో పరిణయము గల్గించుకొను నుద్దేశముతో విలాసరావు పాపారాయుని సమ్మతిపై మోహినిని సంఘములో సభ్యురాలుగా జేర్చెను. పిమ్మట మోహినివంటి సమర్థురాలు దొరకినపుడు నాటకకళను పెంపు జేయు నవకాశమును వ్యర్థపరుపకుండుటకు తనయుద్యోగమునకు రాజీ నిచ్చి నాటకరంగోద్ధరణకు సమకట్టెను. తనయాజమాన్యముక్రింద యథావిధిగ మోహినీ విలాస నాటకసమాజమును స్థాపించెను. అందు పాత్రధారులకు ఉదారవేతనముల నొసగుటచే సత్ప్రవర్తన గలవా రాకర్షింపబడిరి. పిత్రార్జితమగు ద్రవ్య మధికముగ నుంటచే నద్భుతమగు సీనులను నిర్మింపగల్గెను. రానురా నీ సమాజమువా రితరపట్టణములలోగూడ ప్రదర్శనముల గావించి ప్రసిద్ధి గాంచుచుండిరి.

3

దసరాయుత్సవ సందర్భమున కాకినాడలో నాటక పోటీ ప్రదర్శనము లేర్పరుపబడినవి. అయిదారు నాటకసమాజములు పోటీకి నిలిచినవి. అందు ముఖ్యమైనది విజయనగరపు మోహినీవిలాసనాటక సంఘము. వీరి నటనాకౌశల్యమును పొగడని పత్రిక లక్కాలమున లేవు. వీరినే యితర సమాజములవా రాదర్శకులుగ గైకొనుచుండెడి వారు. వీరి ప్రదర్శనములను తిలకించుటకనేక పట్టణములనుండి ప్రజలు కాకినాడలో విడిసియున్నారు. ఇందు ప్రధానపాత్రల కొసంగుటకు పోలవరం జమీందారుగారు బంగారు పతకములు సిద్ధపరచియుంచిరి; నాటక ప్రదర్శనమును చూడకయే పత్రికా విలేఖరులు విమర్శలు వ్రాసి సిద్ధముగ నుంచుకొనియున్నారు. వీరిని పొగడుచు వ్రాసినపద్యము లప్పుడే కాఫీహోటల్సునుండి సోడాషాపులకు పయనమగుచున్నవి; నాటక విమర్శన గ్రంథములలో నొక ప్రకరణము చేర్చవచ్చునని గ్రంథకర్త లువ్విళ్లూరుచున్నారు.

“రేపటి పత్రికలో వేయవలెను; ఈ దినము పత్రికలో వేయరాదు” అని ఖండితముగ తెలియజేయుచు సమాజము వారి ఘనతనుగూర్చి యొక విలేఖరి తంతి నిచ్చెను.

ఈ నాటకసమాజమువారు విడిసియున్న మేడకు సమీపమున ననేక కాఫీక్లబ్బులు, సోడాషాపులు, వంటపూటిళ్లు, కిళ్లీలు చుట్టలు వగైరా కొట్లు, బయలుదేరినవి; ఇందు చిత్ర మేమన, నవన్నియు మోహినీవిలాస నామమున బరగుచుండెను!

విలాసరావు మోహినియెడ కాంక్షించి పడసిన పరిచయ మామె సుగుణరాశి యని నిరూపించుటచే నాతని కామెయెడ గాఢానురాగము కలిగినది. అనురాగ ముత్కృష్టతచే ననుమానహేతు వాయెను. మోహినివంటి లావణ్యరాశి, సుగుణనిధానము, విద్యావంతురాలు తన్ను నిజముగ ప్రేమించునా యను శంక విలాసరావుమనంబున బొడమి దినదినాభివృద్ధి గాంచెను. మరునాడు నాటక మాడవలసిన దిన మునగా చాలరాత్రి వరకిట్టి యనుమానముచే బాధపడుచు, తుద కెట్టులో కన్నులు మూతపడ, నతని యనుమానమును బలపరచు నట్లొక స్వప్నము వచ్చెను. అందు మోహిని తన్ను విడిచి యొక సౌందర్యహీనునకు పరిచర్య చేయుచున్నట్లు గాంచెను. తోడనే మేల్కాంచి యతడు

విషాదసముద్రమున మునిగిపోయెను. మోమెత్తి మోహినితో మాట్లాడలేకపోయెను. మాంద్య మాతని నావహించెను. నాటక మాడవలసిన దినమున నుండు ఉత్సాహ మావంతయు లేకపోవుట సామాజికుల గుసగుసలకు హేతువాయెను. ఆ సమాజమండలి క్రమశిక్షావిధానమును బట్టి యెవ్వరు విలాసరావుతో నీయంశము ముచ్చటింప లేకపోయిరి. విలాసరావు మౌనమును తనయెడ నాతనికి గల నిర్లక్ష్యభావసూచకముగ గైకొని యాతని విముఖత్వమును సహింపజాలకపోయెను మోహిని. తనస్వాధీనమందున్న ప్రేమనంతను విలాసరావునకు ధారవోయు నవకాశముకొరకు సమాజమునందు జేరిన తన్ను నిరాకరించిన కృతఘ్నుని దరి నుండుట తనయాత్మగౌరవమునకు లోపముగ నెంచుచు సమాజము వీడిపోవుట కాయత్తపడుచున్నది, మోహిని.

కార్యక్రమము ప్రకారము ఆరాత్రి నాటకము జరుగక తప్పదు. మోహినీవిలాసరావులు నాయికానాయక పాత్రల ధరించి రంగస్థలమున నిలిచిరి. నాటి నాటక కథ కేవలము కల్పితము. ఇదివర కెవ్వరును ప్రదర్శింపనిది గాన ప్రేక్షకులకు కథ యేమియు తెలియని కారణముచేత కొంతవరకు సమాజమునకు మర్యాద దక్కినది. నాటక కథతో నేమియు సంబంధము లేని సొంత ప్రసంగములోని కిరువురును దిగిరి.

విలాసరావు:— ఆహా! స్త్రీల రహస్యవృత్తుల కనుగొన నెవరితరము?

మోహిని:—స్త్రీలవృత్తుల నిర్హేతుకముగ శంకించువారి పౌరుష మదేటికి?

విలాసరావు:— మానవతులు పౌరుషహీనుల నాశ్రయింపరుగా?

మోహిని:— మానవతుల నాశ్రయించుటచే పౌరుషహీనులు పౌరుషవంతు లగుదురు.

విలాసరావు:— పురుషుల చిత్తవృత్తుల కనువుగ మానవతి మెలగవలదా?

మోహిని:—తనచిత్తవృత్తులను పురుషుడు తన ప్రియురాలి కెరింగింప వలదా?

విలాసరావు:— తాను నిజముగ వలచిన పురుషుని చిత్తవృత్తుల స్త్రీ కనుగొనలేదా?

మోహిని:—తాను నిజముగ ప్రేమించిన స్త్రీని వశపరచుకొనునట్లు పురుషుడు తన చిత్తవృత్తుల మార్చుకొనలేడా?

విలాసరావు:—పురుషుని స్త్రీ వశపరచుకొనగల్గినట్లు పురుషుడు స్త్రీని వశపరచుకొనుట కల్ల.

మోహిని:—అట్లే స్త్రీకి గల మనోనిశ్చయము పురుషుల కుండుట కల్ల.

విలాసరావు:—నీ మనోనిశ్చయము నిన్నటిరాత్రియే తెలిసెను.

మోహిని:—నీ మనోనిశ్చయము నా కింకను తెలియలేదే!

విలాసరావు:—నామనస్సు నిన్నిదినములు కనిపెట్టలేనపుడు నన్ను వదలుట మంచిది కాదా?

మోహిని:—నిన్ను కలియుటకొరకే నిన్ను విడువ నిశ్చయించితిని!

కడపటిమాటలు చెప్పుచు రంగస్థలము వీడి ప్రక్కతెరలోనికి పోయెను, మోహిని. ఎదుట తెర దిగెను. నాటక మభాసయినందులకు సామాజికు లెల్లరు నగుచుండిరి. విలాసరావు లోననున్న పడకకుర్చీపై పడిపోయెను. ప్రధానపాత్రధారునకు జబ్బుగ నుండుటచే నాటకము ఆపుచేయబడినదనియు, టిక్కట్ల రుసుము తిరిగి చెల్లింపబడుననియు నొక సామాజికుడు తెరయెదుటికి వచ్చి ప్రకటించెను. సామాజికులు టిక్కట్ల రుసుము చెల్లించుచుండిరి. ప్రేక్షకు లాశాభంగముచే వెడలిపోవుచుండిరి.

విలాసరావు మనస్సున ననేక ఊహలు వొడమెను. అనేక సంబంధములు నిరాకరించి వివాహమున కియ్యకొనక తుదకు తన కన్ని విధముల నచ్చిన మోహినిని భార్యగా గైకొన దలచియుండ, నిట్టి విఘాతము సంభవించినందులకు విలాసరావు ఐహికసుఖమున కాతడు నోచికొనలేదని నిశ్చయించుకొనెను. మోహిని లేని నాట

కరంగ మతని కేహ్యముగ గాన్పించెను. మోహిని గావించిన పరాభవమునకు తోడివారిలో తల యెత్తికొనజాలక పోయెను. ఆమె యెచ్చటికి పోయెనో, ఆమెగతి యేమాయినో ఆతడు తలపెట్టలేదు.

మరునాడు సామాజికుల జీతముల నిచ్చి, తెరలు మొదలగు నాటకపరికరములను అచ్చట విడిదియున్న యితరసామాజికుల కమ్మివేసెను. పిమ్మట మూడు నాల్గు మాసము లెచ్చటో తల దాచికొనెను గాని, నిర్వ్యాపారత్వమువలన కాలము దుర్భర మగుటచే, మన్యపుజమీందారువారి క్రింద దివానుపని స్వీకరించెను.

౪

కళావంతులకులమునకు జెందిన రామారావు పిన్ననాటనుండియు బీదవిద్యార్థి వసతిగృహమునందు జేరి ఉచితముగ విద్య నేర్చుచుండెను. ఏడెనిమిది వత్సరములు విద్యాభ్యాసము చక్కగ జరిగెను గాని పిదప మశూచికవ్యాధిచే నంగవైకల్యమే గాక మేధాశక్తి క్షీణించుటయు నాతనికి తటస్థించెను. ప్రవేశపరీక్షలో దాటుట కనేక దండయాత్రలు సల్పినను అపజయము యథాప్రకారముగ గలుగుచుండెను. తన యసమర్థతను సమర్థించుకొనుటకు అపజయకారణముల పెక్కులు కల్పించుచుండెను. తాను పరీక్షలలో కృతార్థుడై యున్నతోద్యోగమును చేయుచుండ చూచుట నభిలషించిన తనతల్లి కొలదిమాసముల క్రిందనే మృతి పొందెను. ఇంక తన కీప్రపంచమున దిక్కెవ్వరు తోపలేదు. ఉచితవసతిగృహమం దతనికి తావు దొరకదు. ఇదివరలో కొంత ద్రవ్యసాహాయ్యము చేయుచుండిన మిత్రులు వెనుకాడిరి. ఇట్టియిక్కట్టులతోపాటు ఉబ్బసపుదగ్గు ప్రాప్తించెను. జీవనోపాధికి పలయుప్రయత్నములు చేయవలసి వచ్చెను.

ఉద్యోగముకొరకు రామారావు కాకినాడ వచ్చి సత్రములో బసచేసెను. సత్రపు అరుగుపై గది కెదురుగ పరుండి కుళ్లుకుళ్లుమని దగ్గుచు నిదుర పట్టమి విలపించుచుండెను. దోమలబాధ నివారించుటకు ఆపాదమస్తకము పాతపట్టుకండువాతో కప్పికొని, దీపమును మిణుకు మిణుకు మనునట్లు సన్నముగజేసి శయినించి తనయవస్థను తలచికొనుచుండెను.

రాత్రి పదిగంట లయినది. పౌరు లెల్లరు పోటీనాటకప్రదర్శనవీక్షణమునకై యేతెంచుటచే వీథులు నిర్మానుష్యముగ నున్నవి. ఎగిరి వచ్చినట్లు జట్కాబండి యొకటి సత్రమువద్ద నిలిచెను. తోడనే యొక మానవవిగ్రహము చేత చిన్నట్రంకుపెట్టెతో బండిలోనుండి దిగినట్లాయెను. రామారావు కన్ను విప్పి చూచునప్పటికి మేలిముసుగులోనుండి స్త్రీకంఠధ్వని తనచెంతనే వినబడినది. రామారావు నివ్వెరపడి లేచి కూర్చుండెను. సత్రపు గుమాస్తా యెచ్చటికో పోయెననియు, గదుల తాళము లాతనియొద్దనే యుండుననియు, తనక్రింద నున్న గదిలో నామె కిష్ట మున్నచో నుండవచ్చుననియు రామారావు అయ్యువతి ప్రశ్నల కుత్తరముగా, మధ్యమధ్య దగ్గుచు చెప్పెను. అంత రాత్రివేళ చేయునదేమియుదోచక రామారావుగదిలోనే రాత్రి గడపుటకు మోహిని నిశ్చయించుకొనెను. తోడు నీడ లేని యాతని కీమె దేవతవలె తోచెను. సానుభూతిని వెదజల్లు నామె ముఖలక్షణములచే ప్రోత్సహింపబడి, తనయవస్థ నింతవరకు వినెడువారు లేరని చింతించుచున్న రామారావు తన దీనదశనంతయు సవిస్తరముగ విశదపరచెను. ఆమె హృదయము కరగగా, రోగపీడితుడైన యాతనికి మందుసీసా నందిచ్చుట, దాహమిచ్చుట మొదలగు పరిచర్య చేయుచుండెను. రామారావువలె తానును దిక్కు లేనిదని యామె జీవితములో మొదటిసారి గుర్తించెను. రామారావు దీనవచనము లామె యాలోచనను భంగపరచుచుండెను. ఇంతియ గాక యాని యవస్థ విన సహింపలేక, "నాయనా! చాల రాత్రి యయినది; ఇంక పరుండుము; ఇంకను మేల్కొనిన జబ్బు ఎక్కువగును" అని యామె బుజ్జగింపగా నాతడు కంట తడిపెట్టుకొని, "అమ్మా, నే నెటులయిన చాల కాలము బ్రతుకజాలను; నీసన్నిధిని చనిపోవుటకంటె నా కీప్సితము లేదు." అని యాతడు వెక్కివెక్కి యేడ్వసాగెను. కరుణాంతరంగియైన యామె అట్లు బాసచేయ కొంతసేపటికి రామారావు నిదురించెను.

మోహినికి మాత్రము కునుకు పట్టలేదు. విలాసరావు గావించిన తిరస్కారమున కామెహృదయ మొకప్రక్కనుండి దహించుకొని పోవుచున్నది. ముందు తనగతి యేమియో స్ఫురింపకున్నది. కర్తవ్యమునుగూర్చి చాలసే పాలోచించి తుదకు కొంతకాలము రామారావుతో నుండుట యుత్తమ మని నిశ్చయించెను. సౌందర్యమునను, విద్యయందును తనకంటె చాల తక్కువదశయందున్న రామారావుతో నుండిన లోకు లన్యథా తలంచరు; రామారావువనవముల బట్టి చూడ నాతడును తనయెడల నవ్యక్తముగ ప్రవర్తింపడు. పురుషునియండ నుండు టెందుకైనను స్త్రీకి మంచిది. పలువురకంటబడి యపవాదలకు పాలుగాకుండ తనయెడ సోదరభావమునన్న యీతనితో కాలము గడపుట మంచిది.

తెల్లవారుచున్నది. రామారావు ఉలికిపడి లేచి, 'అమ్మా, అమ్మా' అని కేకవేసెను. మోహినియు 'ఏమి, నాయనా ?' అని యూరడించెను.

"అమ్మా! నన్ను విడిచిపెట్ట నన్నావుగా!"

"ఔను."

"మువ్మాటికి విడిచిపెట్టవుగదా !"

"అలాగే కాని నే నెవ్వరినో, ఎట్లు నీవద్ద నుంటినో, ఎవ్వరితోను చెప్పరాదు. తెల్లవారకపూర్వము మన మిచ్చటినుండి పోవలెను. కారణ మడుగకుము."

"రేపు ఉదయముననే నాకు ఉద్యోగ మిచ్చెదనని యిచ్చట నొక జమీందారు వాగ్దానము చేసెను. రేపు సాయంకాలము మన మేగుదము."

"అటులయినచో నిచ్చట నాయునికి నతిరహస్యముగ నుంచుము. ఉద్యోగపుటుత్తరువును పొందినవెంటనే రైలెక్కి మనము తప్పక పోవలయును."

"ఇదిగో! ఇప్పుడే జమీదారుదగ్గరకు పయనమగుదును." అని లేచి కాల్యకృత్యముల దీర్చికొని తెల్లవారగానే జమీదారుని దర్శించి మన్యములోనున్న పేరుపల్లెకు ఠాణేదారుగా నియమింపబడిన ట్లుత్తరువు గైకొని, శీఘ్రముగా బసచేరి, యీ శుభవర్తమానము మోహిని కెరింగించెను. రామారావు కుండు ఐశ్వర్యసంపదపై మోహినియొక్క సౌఖ్యము ప్రస్తుతపరిస్థితులలో నాధారపడియుండుటంబట్టి ఆమెయు మిగుల సంతసించెను. ఆలస్య మేమియు జేయకుండ కాకినాడను విడిచి రైలు మీద పయినము గావించిరి.

౫

పేరుపల్లెకు పోవుమార్గమున నున్న మెకపుటాడ గ్రామమందున్న దివానుగారిచేతిక్రింద రామారావు ఉద్యోగము చేయవలసియుండుటచే వారింట నొకదిన మాగి వారిదర్శనము చేయుట లౌకికరీతిని మంచిదగుటచే రామారా వట్లు దివానుగారి గృహమునకు మోహినీయుక్తముగ నేతెంచెను. తనరాకకు కారణ మెరింగించిన పిమ్మట దివానుగా రాతని నెక్కుడుగా నాదరించెను. ఇట్టియాదరణకు వేరుకారణ ముండునేమో యని తరువాత జరిగిన వృత్తాంత మనుమానమును కలిగింపక మానదు.

మన్యములో పనిచేయుట కిదియే ప్రథమ పర్యాయ మగుటచేతను, మన్యపుజనులకును భయమును కలిగించు శీతాకాలము చొరపడుచుండుటవలనను, ఆరోగ్యమును కాపాడుకొనుట కతిజాగ్రత్త వహింపవలయునని దివాను శంకరరావు రామారావునకు హితబోధ గావించెను. ఎక్కువగా పనిచేయక పోయినను తాను సైరించెదననియు దివాను వాగ్దానము చేసెను. ఇట్టియనూనప్రేమకు రామారా వెంతయు కృతజ్ఞత చూపించెను. అనారోగ్యకర మగు గడుమన్యములో స్త్రీలతో కాపురముండుట ప్రమాదకర మగుటచే కొంతకాలము మోహినిని దివానుగారింట నుంచుటకు దివాను శంకరరావు ప్రోత్సాహముపై రామారావు సమ్మతించెను. మన్యపునుంచిచెడ్డల నరయువరకు మెకపుటాడలో నుండుటయే భావ్యమని మోహినియు తలచెను. మరునాటి యుదయమున రామారావు పేరుపల్లెకు దివానుగారి జవానును సాయముగా గొని యేతెంచెను.

ఉత్తరక్షణమునుండి మోహినియొక్క ప్రేమను సంపాదింప శక్తికొలది శంకరరావు ప్రయత్నించుచుం

డెను. మదరాసునుండి పండ్లు, పెద్దాపురమునుండి పట్టుచీరెలు, మలబారునుండి సబ్బుబిళ్లలు, కలకత్తానుండి వాసననూనెలు వచ్చి పడుచుండెడివి. శంకరరావు ఇంటిపెత్తనము మోహినిపై బెట్టుచుండెను. సేవకులు, పురవాసులు మోహినిని చిన్నమ్మగారని పిలుచుచుండెడివారు. మాణిక్యాంబ పెద్దమ్మగారయినది. మోహినిని స్వయముగ వశపరచుకొను ప్రయత్నములు భగ్నమగుటచే సిగ్గువిడిచి శంకరరావు ఈపనికి మాణిక్యాంబను పురికొల్పెను. తనగౌరవము శంకరరావుదయపై నాధారపడియుండుటచే నాతనిని మాణిక్యాంబ వారింప సాహసింపలేకపోయెను. సుగుణోపేతయగు మోహినియెడ తానిట్టిరీతిని వర్తింప మాణిక్యాంబకు మనసు పుట్టదాయెను. మోహినినిగూర్చి యోచించినకొలది మాణిక్యాంబ కామెయెడ ప్రేమ యధికమగుచుండెను.

తుదకొకనాడు మాణిక్యాంబ తన మనస్సును మోహినికి వెలిబుచ్చెను. శంకరరావు దుర్మార్గుడనియు, మోహిని శీఘ్రముగ నాతనిగృహము వీడుట యుక్తమనియు నామె సూచించెను,

"నీప్రక్క నుండ నాకు శంకరరావువలన నేమి భయము?"

"అట్లనకుము. నన్నుకూడ నితడు మోసపుచ్చెను."

"అదెట్లు?"

"వెఱ్ఱిదానా! నే నాతని భార్యనని నీవుగూడ నమ్ముచున్నట్లున్నది. ఇతనికి భార్య చనిపోయి నాలుగేండ్లయినది. ఈతడు మూడేండ్లక్రిందట బళ్లారిలో ఉద్యోగము చేయుచున్నప్పుడు వితంతువైన నన్ను మోహించి వివాహమాడెదనని వర్తమాన మంపుచుండెడివాడు. ఇంతలో నాతని కీగ్రామము బదిలీయగుటచే నాతని నమ్మి వెంట వచ్చితిని. ఇచ్చట నాప్రవర్తనకు కళంకము కలిగించెనే కాని యథావిధిగ వివాహ మాడకుండెను. ఇప్పుడీతని విడిచి పోయిన నేనధోగతిపాలగుదును. చిన్నతనముచేత నీగతికి దిగితిని. కూటికి, గుడ్డకు లోటు లేదు గాన నిచ్చటనే యుండ నిశ్చయించితిని. ఇక రెండు దినము లుండిన నీవును నాగతికే వచ్చెదవని భయపడుచున్నాను. ఇట్లు చెప్పినందులకు క్షమింపుము."

"మోసగానికి మోసమే శిక్ష!"

"అబ్బో! ఆతని మోసపుచ్చుట సాధ్యము కాదు."

"అట్లనకుము. నీవు పూర్తిగ నాకు సాయపడినచో ...."

"నాప్రాణములైన నీయధీనము చేసెదనని నమ్ముము."

ఇట్టిప్రసంగమున నున్న యువతులయెదుట హడావిడిగా ప్రత్యక్షమై, అతితొందరపని తటస్థించుటచే తాను పీరుపల్లె వెళ్లవలసి యున్నదనియు, తత్క్షణమే బయలుదేరుదుననియు శంకరరావు తెలిపి, మాణిక్యమువైపు భావయుక్తముగ వీక్షించి, "నేను తిరిగి పదిదినములలో వచ్చేసరికి నే చెప్పినది సిద్ధపెట్టుము" అని దీనముగ బల్కి వెడలిపోయెను.

శంకరరావునకు పరీక్షాయోగ్యతలు లేవు. ఉద్యోగానుభవమును తక్కువ. సామర్థ్యమును చాలదు. అయినను వితంతువివాహము చేసికొననున్నట్లాతడు జమీందారుగారికి విన్నవించుటచే సంఘసంస్కర్తయగు నామహనీయుడీగొప్పయుద్యోగము నాతనికిచ్చెను. ఉద్యోగము దొరకినపిమ్మట బహిరంగముగ మాణిక్యమును వివాహమాడుట కాతడిష్టపడకుండెను. పీరుపల్లె కాతడిప్పుడు పోవుటకు కారణము మోహినివృత్తాంతమును తెలిసికొనుటకే. రూపసంపద లేని రామారావునకు మోహిని భార్య కాదని శంకరరావు శంకించెను. మోహినిని వివాహమాడుతలంపుతో శంకరరావు తనమార్గమున నాటంకములు లేకుండ జూచుకొను నుద్దేశమున నుండెను. అట్టిసమయమున నాతని కొక లేఖ చేరినది:

"అయ్యా!

"నేనును, మాణిక్యాంబయు చామర్లకోటలో నున్నాము. రేపు సాయంకాలము రాజమండ్రీ వెళ్ళుచున్నాము. అచ్చట మాణిక్యాంబ పునర్వివాహము వారమురోజులలో జరుగును. ఈసంగతి నాకిప్పుడే తెలిసినది; తెలియక ఆమెతో పయనమయితిని. అయినను ఆమెతో

కూడ నుండుటచేత తమకీజాబువలన కృతజ్ఞతా పూర్వక ముగ కొంత మేలు చేసినదాన నగుదునని సంతసింపుచు న్నాను. జాగు చేయక వలయు ప్రయత్నములు చేయుడు. తొందరచే గలిగిన లోపముల క్షమింపుడు.

చి త్తగించవలెను,

"మోహిని."......

ఎవ్వరితో నేమియు చెప్పక, జాబును చదివినవెంట నే చామర్ల కోటకు బయలుదేరి, మార్గాయాసమునకు వెనుదీ యక జట్కామీద ప్రయాణము చేసి, యాసాయంకాలము నకు సామర్ల కోట సత్రమును జేరికొని, యచ్చట మోహినిని గాంచి, "మాణిక్యమేది" అని యడిగెను.

"కాబోవు భర్తతో కాకినాడ వెళ్లినది."

"ఎందుకు ?"

"ఉద్యోగముకొరకు జమీదారుగారిని దర్శించి భర్తకు ఉద్యోగ మిమ్మని కోరునట !"

"కొంప మునిగిందే!"

"ఏల ?"

"ఏమయితే నేం! నా ప్రారబ్ధం. ఇదివరకే నే నా మెను వివాహమాడిన ఈయుపద్రవము జరుగకుం డెడిది... అయినను, మోహినీ! నీజాబువలన నొనర్పదలచిన మహో పకారమును పూర్తిచేసి నన్ననుగ్రహింపుము. నీయెడ నా కిదివరలో కలిగిన చెడుతలంపులకు నన్ను మన్నింపుము. మాణిక్యమును వివాహమాడుటకు సిద్ధముగ నున్నాను. ఆమె నన్ను వివాహమాడనిచో నాయుద్యోగము పోవును. వితంతువివాహమును చేయదలచికొనినందులకు నాబంధుగు లిదివరకే నన్ను వదలిపెట్టిరి. నీవు తప్ప నా కిప్పట్టున దిక్కు లేదు. అమ్మా! దీనుని రక్షింపు." అని శంకరరావు విలపించెను.

కొంతసేపాలోచనను నటించి తాను కాకినాడ వెళ్లి మాణిక్యాంబను కలిసికొని యామెకు నచ్చచెప్పి మరునాడుదయము రాజమండ్రీకి తీసికొనివచ్చెదననియు, శంకరరావు వెంటనే రాజమండ్రీ వెళ్లి మరునాడే వివాహ ము జరుగుటకేర్పాట్లు చేయవలయుననియు నాతనితో చెప్పి పంపివేసెను.

తెల్లవారుజాముబండిలో మోహినీమాణిక్యాంబలు రాజమండ్రీ వెళ్లి యుదయ మేడు గంటలకచ్చటచేరిరి. శంకరరావు కొందరి మిత్రులతో స్టేషనునద్ద కాచుకొని యుండెను. మాట్లాడినచో భావికార్యమున కేమిభంగము ల్గునోయని యందరును మౌనము వహించిరి. శంకరరావు వారిరువురను గమ్యస్థానమునుజేర్చెను. అనాథశరణాలయ మందు బ్రహ్మసమాజఫణితిని శంకరరావు మాణిక్యాంబను వివాహమాడెను.

మోహినీ మాణిక్యాంబలు పన్నినయుపాయము శంకరరావు ఎఱుంగడు. తనభార్య లేచిపోయెనని పలువు రాక్షేపింతు రను భీతిచే కాకినాడ వెళ్లి జమీదారుగారిని చూచి వేరొకస్థానమునకు బదిలీ నొందెను. మోహినిని పీరుపల్లెలో దిగవిడిచి బదిలీ గ్రామమునకు భార్యాసహిత ముగ వెడలెను, శంకరరావు.

౬

జరుగుబాటు లేనివారికి సౌందర్యమే శత్రువు. సౌందర్యరక్షణకై ఇదివరలో నేర్పరచిన సైనికదళమును వదల్చుకొనిన గాని తనకు క్షేమము కలుగదని మోహిని యెంచి అద్దము నావల నుంచెను; సబ్బులకు స్వస్తి చెప్పెను; దువ్వెన దవ్వున కేగెను.; పట్టుచీరెలు పెట్టె దాగెను.; వాసననూనెల వాసనే లేదు.; చేతిరుమాళ్ళు చెదరిపోయె ను. ముంతంతకొప్పు, రూపాయంతబొట్టు, కచ్చాపోసి కట్టు, పాతమేలికమ్మిచీర, తురకభొంబాయిగుడ్డ రవిక మొదలగు లాంఛనములతో పేద పల్లెటూరి ముత్తయిదువ వలె మోహిని ఇప్పుడరణ్యములో నజ్ఞాతవాసము గావింపు చున్నది. రామారావు పనిపాట లేమియు తలపెట్టక ఆ రోగ్యమును కాపాడుకొనుచు నెప్పటిటో కాలము గడపు చుండెను.

రెండుదినముల క్రిందట క్రొత్తదివాను చార్జీపుచ్చుకొ నెను. అప్పుడే యాయన యుదారస్వభావుడనియు, ధని కుడనియు, రూపవంతుడనియు మన్యమంతయు మ్రోగు చున్నది. నాటిసాయంకాలము దివానుగారు పీరుపల్లె వచ్చెదరని తాఖీదును జవాను పట్టుకొని వచ్చెను. రామా

రావు తాఖీ దందిన ఘడియనుండియు దివానుగారి కుచిత రీతిని మర్యాదచేయుట కేర్పాట్లు చేయుచుండెను.

కులభేదము పాటింపని ఉపా నారాత్రి రామారావింట నతనిపంక్తిని భోజనము చేయుచుండెను. పూర్వపు దివానువలన కలిగిన కష్టము లీతనివలన కలుగునేమోయని మోహిని చాటుగ మెలగుచుండెను. వంటక మెద్దియో కావలసి రామారావు 'మోహినీ' యని పిలిచెను. మోహిని వంటకముతో నెదుట నిలిచెను. దివానామె మోమును దిలకించుటలో నిద్దరిచూపులు కలిసిపోయెను. మోహిని మూర్ఛిల్లెను. దివాను విడిదిగృహమున కేగెను. రామారావు మోహిని కుపచారము చేయుచుండెను. కొంతసేపటికి, దివానుగారికి హఠాత్తుగా జ్వరము వచ్చుటచేత మెకపుటాడ వెళ్లిపోయినారను వర్తమానము రామారావునకు తెలిసినది. మూర్ఛతేలిన మోహిని యీవార్త విని 'కృతఘ్నుడు' అని తిరిగి మూర్ఛపోయినట్లు శయనించెను. మోహినీవిచిత్రచర్యలును, దివానుగారి ఆకస్మిక నిష్క్రమణమును రామారావు మనస్సు కలగించెను.

కాకినాడలో గాంచిన కల నిజమాయెనని నూతన దివాను విలాసరావు తలపోసెను. మోహిని నెంతయు లోలోన దూషింపుచుండెను. కొలదిదినముల క్రిందటనే ఈయుద్యోగమునందు ప్రవేశించుటచేత నిప్పుడే బదిలీని కోరుట తగదని యూహించెను గాని యామె యున్న ప్రాంతముల నుద్యోగము చేయుట కాతనికి శృంగభంగముగ దోచెను. ఇట్లు డోలాయమాన మానసుండైన దివానువిలాసరావునకు జమీదారుగారు జరూరుగా నుత్తరువు గావించిరి. పీరుపల్లెతానేదారు వసూలుచేసిన దస్తునుండి ఎనిమిది వేలరూపాయల నతి త్వరలో పంపవలెనని జమీదారుగారి యాజ్ఞ. దివాను తానేదారు రామారావునకు వ్రాసి పంపగా నాతడొక్కనూరు రూపాయిలైన వసూలు చేయలేదని జవాబిచ్చెను. దివానీసంగతిని జమీదారువారి కెరుకజేసి, తానేదారుని అతని యశ్రద్ధకు సంజాయిషీ యడిగెను.

తనయశ్రద్ధకు గలుగు దుష్ఫలమునుండి తప్పించుకొనుటకు రామారావొక కుట్ర పన్ని యందు మోహినిని సహాయము కోరెను. తనమోహినిని దివాను మోహించి యామెను పొందుటకు తన్ను పాడుచేయ దివాను సంకల్పించుకొని యన్యాయముగ దోషారోపణ గావించుచున్నాడని జమీదారున కర్జీ నిచ్చెను. అర్జీవిచారణసమయమున నిజస్థితి బయలుపడునని విలాసరావును అపవాదనుండి తప్పించుటకు తనసాక్ష్య మవసరమగుటచే నాతడు తనసాయమును కోరక మానడనియు, అప్పుడు విలాసరావుతో సంయోగము కలుగగలదనియు మోహిని దృఢముగ నమ్మి రామారావు పన్నిన కుట్రలో జేరెను.

ఈ అర్జీసంగతి దివానునకు తెలిసి చాల విచారించెను. మోహినినిజచరిత్ర నెల్లడించుట కాతని కిష్టము లేదు సరేకదా, మోహినిపేరీయర్జీలో నుండుటామెకును తనకును మానహానిగ దోచెను. మోహిని కీయర్జీసంగతి తెలిసియుండదనే యాతనినమ్మకము. కావలసినంత ధనమున్న విలాసరావున కీయుద్యోగము లెక్కలేదు కాని ఈనేరారోపణ తనగౌరవమునకు భంగకరమని మిక్కిలి చింతిల్లుచుండెను. మోహిని తనపై నబద్ధపు సాక్ష్యమిచ్చుట కల్ల యను గాఢవిశ్వాసముతో నాతడు మెదలకుండెను.

౭

విలాసరావు నాకర్షించి తిరస్కరించిన మోహినిని చూచుకాంక్ష వొడముటచే జమీయజమాని సొంతముగా నీయర్జీని విచారించుటకు కాకినాడనుండి పీరుపల్లి వచ్చియుండెను. రామారావు బలవంతపెట్టగా నాపూట నాతని గృహముననే విందారగింప నియ్యకొనెను. మోహినీ సౌందర్యవీక్షణాయత్తచిత్తుండగు యజమాని వినాయకరావున కీయాహ్వాన మమితామోదమును కలిగించెను.

మోహినిని జూచు నవకాశమును పొడిగించుటకో యన వినాయకరావు భోజనసమయమున ననేకవిషయములగూర్చి ప్రస్తావించుచుండెను. అందు, విచారణకున్న యర్జీనిగూర్చి ముచ్చటించుచు, తీర్పు మోహినిసాక్ష్యముపై నాధారపడియున్నదని సూచించి దృష్టి మో

హినిపై ప్రసరింపజేసెను. "అట్లయిన న్యాయము దొరకు" నని రామారావు సంతోషముగ పలికెను. తనగౌరవమును రామారావు కాపాడజాలడని మోహినికి విశదమాయెను. వినాయకరావు చేష్టలవలన నాతనికి తనయెడగల దురుద్దేశమును మోహిని గుర్తించెను. ఇట్టిసందర్భమున మూకీభావము కూడదని యామె నిశ్చయించుకొనెను.

"ఆడుదానిమాటయా మీ కాధారము?" అని వేళాకోళము చేసెను, మోహిని. అదను దొరకెగదా యని వినాయకరావు సంభాషణ పెంపుచేసెను.

"ఆడుదానిమాటయే యర్జీ కాధారముగదా!"

"అట్టియెడ నాడుది పరిష్కరింపవలసిన తగవు కదా యిది?"

"తగవు గలదా లేదాయని విచారించుటకుమాత్రమే నేను వచ్చితిని."

"స్పష్టము కాని తగవునకు తగ వేమి?"

"తగవు గలిగించినవారినడుగవలసిన విషయ మది."

"ముం దట్టివారిని విచారించినగదా సాక్షుల విచారింపవలెను."

"సాక్షుల నడిగినగాని తగవు స్పష్టపడు టెట్లు?"

"తగవును స్పష్టపరుపని యర్జీ విచారణ యేల?"

"అర్జీ విచారణలో బెట్టకపోయిన నీపరిచయ మెట్లు కలుగును?"

"కేవల పరిచయమువలన లాభ మేమి?"

"పరిచయమువలన లభించుమార్గములువిశదమగును."

"వచ్చినమార్గ మేమార్గము?"

"అట్లన రామారావును కాకినాడకు బదలీచేసెదను."

"అట్లు చేసిన అర్జీని బుట్టలో వేయవచ్చును" అని మోహిని అనుటతోడనే ఇంతవరకు సంభాషణ మెట్లు పరిణమించునో యని కాచికొనియున్న రామారావు, "అంతకంటె మాకు కావలసిన దేమి?" అని తృప్తిని వెల్లడించెను.

"హుజూరులోనున్న పనిపాట లుండవనా?" అనెను చిరునవ్వుతో మోహిని.

"హుజూరువారి పనిపాటల నీ వింక చూచెదవు కదా?" అని వినాయకరా వందికొనెను.

కాకినాడకు రామారావును బదలీచేయుట నిశ్చయింపబడిన పిదప భోజనమును ముగించిరి. ఈబదిలీ యందరకును సంతృప్తిదాయకముగ నుండెను. దివాను తనపై మోపిన నేరము మాసిపోయెనని, రామారావును, మోహినిని తరచు చూచుభాగ్యము కల్గునని వినాయకరావును, విచారణ లేకుండా అర్జీని బుట్టదాఖలు చేయించితినని మోహినియు సంతసించిరి. దైన్యము వదలిపోవునని మోహినీ రామారావు లుప్పొంగిరి. మరునాడే వీరిరువురును, వినాయకరావును కాకినాడకు పయనమైరి.

౭

కాకినాడలో నింకను రామారావు కాపురము స్థిరపడలేదు; వినాయకరావు తన నీచప్రయత్నముల నారంభింపలేదు; అర్జీవిచారణవలన కలిగిన యాశాభంగ మింకను మోహినికి చల్లారలేదు; అప్పుడే యొకపుటాడ దివాను రామారావుపై అర్జీవలన తనకు గల్గిన మర్యాద నష్టమునకు పరిహారముగ పదివేలరూప్యములకు దావా తేనున్నవా డను నిశ్చయమైన కబురు రామారావునకు తెలిసినది.

అర్జీలోని సంగతి యబద్ధమని యెరిగియున్న రామారావున కీవార్తసహింపరానిదయ్యెను. దావాలోతానోడిపోవుట నిశ్చయము, పదివేలరూప్యముల నిచ్చు టెట్లు? ఆతనిచేత గవ్వయినను లేదే! కారాగృహప్రవేశము తప్పదని యతడు విలపించెను. విలాసరావు పాదములపై బడి క్షమాపణను కోరుటకంటె గత్యంతర మాతనికగపడలేదు. తనకు తటస్థింపనున్న యాపదను మోహిని కెరింగించి తన సంకల్పమున కామె యభిప్రాయము వేడెను. తన యుపాయములు వ్యర్థమయినందులకు లోలోన నగచుచున్న మోహిని కర్తవ్యమునుగూర్చి రామారావుతో నేకీభవించెను.

సహజముగ రామారావు పిరికివాఁడు. తాను చేసిన యపరాధ మాతని మరింత పిరికివానిగ జేయుటచే నాత డొంటిగ విలాసరావును దర్శింపలేక మోహినిని తన వెంట నాతనికడకు రమ్మని యతివినయముగ బ్రార్థించెను. విలాసరావునెడ నామెకు గల ప్రేమ యామెను మరింత ప్రోత్సాహపరుప నామె రామారావుతో మెకపుటాడకు బయలు దేరెను.

మోహినియు, రామారావును ఎదుట బడగానే విలాసరావు మనస్సున క్రోధము, ఆశ్చర్యము, జుగుప్స ఒండొంటితో బోరాడుచు దృఢముగ నిలుచుటచే కొంత తడ వాతడు పలుకజాలకపోయెను. భయము రామారావు గొంతుక నొక్కివేసెను. కార్యనిర్వహణ భారము తనపై బడినదని మోహిని గుర్తించెను.

విలాస:—శంకరరావును మాయచేసినట్లు నన్నును మాయచేయ వచ్చితివా?

మోహిని:—మాయనుండి మిమ్ము తప్పించుటకే వచ్చితిమి.

విలాస:—నీవు మాయనుండి తప్పించుకొనిన పిమ్మట నాసంగతి యాలోచింతువు గానిలే!

మోహిని:—నే నొరుల మాయలో బడలేదే!

విలాస:—రామారావును, ఆతడిచ్చిన యర్జీయును సాక్షులు.

మోహిని:—సాక్ష్యము నాకే బలకరము.

రామా:—అవును, తప్పకుండ నంతే!

విలాస:—ఛీ! స్వలాభముకొరకు భార్య నపవిత్ర నుగ గావించిన నీప్రసంగము కట్టిపెట్టుము.

రామా:—రామరామ! ఈమె నాతల్లి. నా ప్రాణమును రక్షించి, మానమును కాపాడి యుద్యోగ మును నిలువబెట్టిన మహాదేవత!

సంభాషణము ముదురుచున్నటుల గ్రహించి, నాటకశాల వదలిన దాదిగ నాటివరకు జరిగిన వృత్తాంత మంతయు సవిస్తరముగ మోహిని యెరింగించి, 'నిన్ను కలియుటకే నిన్ను విడిచెద'నని తా నానా డనిన పలుకుల జ్ఞప్తికి తెచ్చెను.

అప్పుడొక వయోవృద్ధుడు ఆకస్మికముగ లోని కరుదెంచి మోహినిం గౌగిట బట్టి, సంభ్రమమువలన నూత నముగ తొలగింపబడిన ఆశాభంగము వెలువడునట్లు బాష్పముల విడుచుచుండెను. మోహినీ విలాసరావులు వేరుపడిరని వినినప్పటినుండియు మోహినిజాడల నరయ ననేక పట్టణముల దిరిగి తుద కానా డామెను జూడగల్గిన పాపారావు సంతోషమునకు మేర లేదు. వేశ్యామణి యగు నాగమణి కులవృత్తినుండి తనకూతురును తప్పించుటకు మూడేండ్లయీడుననే మోహినిని తనకు గురువైన పాపారావున కప్పగించెను. అతని కాత్మజులు లేని లోపము మోహినివలన తీరెను. పాపారాయ దంపతులు జననీజనకులనియే మోహిని తలచెడిది. వారును మోహినీ జన్మవృత్తాంతమును మరుగుపరచిరి. కొలదికాలము క్రిందట నాగమణి మరణించిన వార్తనైనను మోహిని యెరుంగదు. పాపారాయుని దర్శనమువలన మోహిని కెట్టియానందము కలిగియుండునో! విస్మయమునుండి తేరిన పిదప విలాసరావు పాపారాయుని గౌరవించి యిష్టాగోష్ఠి ప్రారంభించెను. మోహినీవిలాసు లొకరిపై నేరముల నొకరు పాపారాయునకు దెల్పుచుండిరి. ఈతగవును తీర్చుటకు రామారావు సాక్ష్య మవసరమాయెను. రామారావు తాను నాగమణియను వేశ్యాపుత్రుడనియు, కులవృత్తిపై రోతగల్గి యాతనితల్లి తన్నొక బీదవిద్యార్థి వసతిగృహపు యజమానుల కప్పగించెననియు, నామె కొన్నిమాసముల క్రిందటనే గతించెననియు, దిక్కులేక యల్లాడు స్థితిలో మోహిని తన్ను సోదరునివలె గాపాడిన దనియు చెప్పుచుండగా, పాపారా వొక కాగితమును జేబునుండి తీసి విలాసరావున కందించెను. విలాసరావు కుర్చీనుండి తత్తరపాటుతో లేచి మోహినిని కౌగిలించుకొని క్షమాపణ వేడెను.

ఈ కాగితము నాగమణి మరణకాలమున వ్రాసిన మరణశాసనము. అందు తనబిడ్డలగు రామారావు మోహినులకు సమముగ నీయగలందులకు పదివేల రూపాయల సొత్తును పాపారావునకు స్వాధీనపరిచెనని యున్నది.

మరుసటి దినముననే రాజమండ్రీలో రామారావు కన్యాదానము గావింప, బ్రహ్మసమాజ విధానమున మోహినీవిలాస పరిణయము శోభాయమానముగ జరిగెను.